పథకాల అమలుకే ప్రజాపాలన

దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్ రూరల్, జనవరి 6: సంక్షేమ పథకాల అమలుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపడుతున్నదని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని ఊటూర్ గ్రామంలో శనివారం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దరఖాస్తులను ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు లేని వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎలగందుల సుదర్శన్, ఎంపీపీ ముద్దసాని సులోచన-శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ సీహెచ్ రాజు, ఎంపీటీసీ గోపు మమత-శ్రీనివాస్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు అందేలా చూస్తాం

కార్పొరేషన్, జనవరి 6: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా బల్దియా పాలకవర్గం కృషి చేస్తున్నదని మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. శనివారం నగరంలోని 14, 47వ డివిజన్లలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో ఎనిమిది రోజుల్లో సుమారు 90 వేల దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దిండిగాల మహేశ్, షర్ఫొద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తు స్వీకరిస్తున్న మేయర్ సునీల్‌రావు

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

తాడిజెర్రిలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, జనవరి 6: ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు. మండలంలోని తాడిజెర్రి, ఉప్పరమల్యాల, వెంకంపల్లి, వెంకటాయపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రెండు గ్యారెంటీలను అమలు చేసినట్లు పేర్కొన్నారు. మిగతా నాలుగు గ్యారెంటీలను అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ పుల్కం అనురాధ-నర్సయ్య, సర్పంచులు రామిడి కనకమ్మ, బొల్లాడి మంజుల-శ్రీనివాస్‌రెడ్డి, ముక్కెర మల్లేశం, శ్రీమల్ల మేఘరాజు, ఎంపీటీసీలు ద్యావ మధుసూదన్‌రెడ్డి, ముద్దం జమున-నగేశ్, ఉపసర్పంచులు సుద్దాల రాజశేఖర్‌రెడ్డి, మోతె నర్సింహారెడ్డి, వేముల శ్రీధర్, అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాజీ మంత్రి

కార్పొరేషన్/కలెక్టరేట్, జనవరి 6: కరీంనగర్‌లోని కలెక్టర్‌లో కలెక్టర్ పమేలా సత్పతిని శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఆయన వెంట మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, తదితరులు ఉన్నారు.

కలెక్టర్ పమేలా సత్పతికి పూల మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కేసీఆర్ పాలనలో నీళ్లు.. కాంగ్రెస్ పాలనలో కన్నీళ్లు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

- రైతుబంధు నిధులను కాంట్రాక్టర్లకు మళ్లించారు
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజం

గంగాధర, జనవరి 6 : కేసీఆర్ పాలన పుష్కలంగా నీళ్లు ఇస్తే.. కాంగ్రెస్ పాలన రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు కింద కేటాయించిన రూ.7700 కోట్ల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్ల కోసం దారి మళ్లించి రైతుల నోట్లో మట్టికొట్టిందని ధ్వజమెత్తారు. గంగాధర మండలం మధురానగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 122 కిలోమీటర్ల మేర వరదకాలువ విస్తరించి ఉందని, చొప్పదండి నియోజకవర్గంలో 42 కిలోమీటర్ల కాలువ ఉన్నదని, దీనిని నమ్ముకుని నియోజకవర్గంలో దాదాపు 27 వేల ఎకరాల్లో రైతుల పంటలు సాగు చేస్తున్నారని గుర్తు చేశారు. ఎక్కడా ఇబ్బంది లేకుండా సాగునీరివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సర్పంచులు వేముల లావణ్యాఅంజి, కంకణాల విజేందర్‌రెడ్డి, వేముల దామోదర్, ఎంపీటీసీ ద్యావ మధుసూదన్‌రెడ్డి, నాయకులు అట్ల శేఖర్‌రెడ్డి, లింగాల దుర్గయ్య, దోమకొండ మల్లయ్య, పడిదపెల్లి కిషన్, గునుకొండ బాబు, గంగాధర రాజయ్య, సుంకె అనిల్, సాయిళ్ల సంతోష్, మామిడిపెల్లి అఖిల్, ద్యావ సంజీవ్, గంగాధర నగేశ్, నరేశ్, సముద్రాల ఓంకార్, పెరుక మహేశ్, తూం రవి పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తాం

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడిలో సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి పొన్నం

చిగురుమామిడి, జనవరి 6: తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలకు అనారోగ్య సమస్యలు ఉంటే మెరుగైన చికిత్స అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. తోటపల్లి రిజర్వాయర్‌లో భాగంగా ఓగులాపూర్‌లో సేకరించిన భూములను ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు తిరిగి ఇప్పిస్తామని చెప్పారు. అనంతరం లంబాడీపల్లెలో జీపీ భవనాన్ని ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ప్రారంభించారు. టీఎస్ పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో లంబాడిపల్లె సర్పంచ్ నాగెల్లి వకులాదేవి, ఉపసర్పంచ్ ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ గీకురు రవీందర్, వైస్ ఎంపీపీ భేతి రాజిరెడ్డి, ఎంపీడీవో నర్సయ్య, తహసీల్దార్ ఇప్ప నరేందర్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి చిట్టిమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధులు దాసరి ప్రవీణ్ కుమార్, ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, సుందరగిరి సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్, మండల మహిళా అధ్యక్షురాలు ఓరుగంటి భారతీదేవి, జిల్లా మహిళా నాయకులు బుర్ర శివ లీల, పచ్చిమట్ల లక్ష్మి, బోయిని సురేశ్, నరేశ్, పోలు స్వప్న, అందె సురేశ్, పూల లచ్చిరెడ్డి, పోటు మల్లారెడ్డి, బుర్ర శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ రవి ప్రసాద్, ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన డీఎంగా శ్రీకాంత్ బాధ్యతల స్వీకరణ

హుజూరాబాద్ టౌన్, జనవరి 6: ఆర్టీసీ హుజూరాబాద్ డిపో నూతన మేనేజర్‌గా నియామకమైన సామల శ్రీకాంత్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి దాకా డిపో మేనేజర్‌గా పని చేసిన పుప్పాల అర్పిత వరంగల్‌లోని స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న పీ అర్పితతో పాటు నూతన డీఎం శ్రీకాంత్‌ను కార్మికులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

జిల్లా కో-ఆర్డినేటర్‌గా నాగేందర్ సింగ్

తెలంగాణచౌక్, జనవరి 6: తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్‌గా సర్దార్ నాగేందర్ సింగ్‌ను నియమించినట్లు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జక్కోజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ ఫయాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, తనపై నమ్మకంతో ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌గా నియమించిన బీసీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ ఫయాజ్, పెద్దపల్లి, జిగిత్యాల, సిరిసిల్ల జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

సైదాపూర్, జనవరి 6: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని పోతారం ఎక్స్‌రోడ్‌లో గల శుభం గార్డెన్‌లో ఆదివారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ఉంటుందని పారీట మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జి వొడితల సతీశ్‌కుమార్, హనుమకొండ జిల్లా పరిషత్ అధ్యక్షుడు ఎం సుధీర్‌కుమార్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ దేవసేన
- శ్రీనగర్‌కాలనీ స్కూల్‌లో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

విద్యార్థినికి బ్యాగు అందజేస్తున్న విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన

కమాన్‌చౌరస్తా, జనవరి 6: ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు నాణ్యమైన విద్య నందించాలని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ దేవసేన సూచించారు. జిల్లా కేంద్రంలోని సప్తగిరికాలనీ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో శనివారం ఆమె విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవసేన విద్యార్థులతో ముచ్చటిస్తూ పాఠశాలలో కల్పిస్తున్న వసతులు, ఉపాధ్యాయుల బోధన తీరుపై ఆరా తీశారు. ప్రధానోపాధ్యాయుడు నరహరి సత్యనారాయణరెడ్డిని సత్కరించి, విద్యార్థులకు బోధించే వినూత్న పద్ధతిని అభినందించారు. విద్యార్థులకు బ్యాగులు అందజేసిన లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సభ్యుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సీహెచ్ వీఎస్ జనార్దన్ రావు, కార్పొరేటర్ బుచ్చిరెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా సభ్యులు హనుమాండ్ల రాజిరెడ్డి, రమణారెడ్డి, బాలాజీనగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోమల్ రెడ్డి, శ్రీనిధి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కరుణాకర్, లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ డైరెక్టర్, ఎస్‌జీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, ఎంఈవో మధుసూదనాచారి, సెక్టోరల్ అధికారి అశోక్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ సదయ్య, ఉపాధ్యాయులు శైలజ, తిరుపతి రెడ్డి, వెంకటేశ్, నజ్మా, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి

కలెక్టరేట్, జనవరి 6: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ సూచించారు. నగరంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాన్ని శనివారం ఆయన సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, వసతి గృహం నిర్వాహకురాలు పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు అర్జీల వెల్లువ

కార్పొరేషన్/హుజూరాబాద్/ టౌన్/ కరీంనగర్ రూరల్/ వీణవంక/ శంకరపట్నం, జనవరి 6: నగరంలో 83670 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలంలో 15261 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు. హుజూరాబాద్ డివిజన్‌లో పరిధిలో 91733 దరఖాస్తులు రాగా, ఇందులో వీణవంకలో 17688, హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో 12,319 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. శంకరపట్నం మండలంలో 16454 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీవాణి తెలిపారు.

ఆలయ వార్షికోత్సవాలు

చొప్పదండి, జనవరి 6: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర- మణికంఠాలయ 9వ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయంలోని దేవతా విగ్రహాలకు కోటిలింగాలలోని గంగా నదిలో పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ చైర్మన్ వెంకటేశ్ గౌడ్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత

గంగాధర, జనవరి 6: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం డీఐఈవో జగన్మోహన్ రెడ్డి అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రిన్సిపాల్ ప్రమీల ఆధ్వర్యంలో అధ్యాపకులు సొంత ఖర్చుతో అల్పాహారం అందజేయడం హర్షణీయమన్నారు. అధ్యాపకులను డీఐఈవో అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణరెడ్డి, గీతావాణి, నిత్య, రాజమహేంద్ర, రాజు, మహేశ్వర్, సురేశ్, ఇందిర, లైబ్రేరియన్ రాజ్‌కుమార్, నాన్‌టీచింగ్ స్టాఫ్ మంజుల, పద్మావతి, శ్రీకాంత్, పద్మ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అల్పాహారం అందజేస్తున్న డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి

వాణీనికేతన్‌లో స్నాతకోత్సవ సంబురం

పట్టాలు అందుకున్న విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, జనవరి 6: జిల్లా కేంద్రంలోని వాణీనికేతన్ ఎంబీఏ కళాశాలలో స్నాతకోత్సవ సంబురాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాతవాహన కామర్స్, మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్ హాజరై ఎంబీఏ, ఎంకాంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ డీ వెంకటరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ రావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు విద్యార్థి ఎంపిక

కొత్తపల్లి, జనవరి 6: పంజాబ్ రాష్ట్రం లూధియానలో ఆదివారం నుంచి జరిగే జాతీయస్థాయి పాఠశాలల అండర్-17 జూడో చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థి అమన్‌రెడ్డి ఎంపికైనట్లు పీఈటీ మహేందర్ తెలిపారు. పాఠశాలలో శనివారం అమన్‌రెడ్డిని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీత రెడ్డి, ప్రిన్సిపాల్ సరితా రెడ్డి, పీఈటీలు మహేందర్, జహీద అభినందించారు.

కార్యదర్శిగా కుమారస్వామి

తెలంగాణచౌక్, జనవరి 6: బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శిగా చెన్నబోయిన కుమారస్వామిని నియమించినట్లు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మర్రి శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు నగరంలోని సంఘ కార్యాలయంలో శనివారం నియామక పత్రం అందజేశారు.

పంటల వివరాలు నమోదు

కరీంనగర్ రూరల్, జనవరి 6: నగునూర్, చామనపల్లి, మొగ్దుంపూర్, దుర్శేడ్ గ్రామాల్లో శనివారం వ్యవసాయాధికారులు పంటల వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాల స్థలం ఆక్రమణకు యత్నం

కమాన్‌చౌరస్తా, జనవరి 6: మానేరు డ్యాం సమీపంలోని శాతవాహన యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల స్థలాన్ని శుక్రవారం సాయంత్రం కొందరు ఆక్రమించేందుకు యత్నించగా అధికారులు అడ్డుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాగా, ఫార్మసీ కళాశాల భూమిని ఆక్రమిస్తే ఊరుకునేది లేదని వీసీ మల్లేశ్ హెచ్చరించారు. యూనివర్సిటీకి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించడానికి యత్నించడంపై విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి మాట్లాడుతూ, ఫార్మసీ కళాశాల భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పీహెచ్‌సీ భవనం పరిశీలన

మానకొండూర్ రూరల్, జనవరి 6: మండలంలోని వెల్ది పీహెచ్‌సీ సెంటర్ పరిధిలోని లక్ష్మీపూర్‌లో నిర్మిస్తున్న భవనాన్ని శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి పరిశీలించారు. భవనంలో డాక్టర్లు, సిబ్బంది, ప్రజలకు అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బియాబానీ, డీపీవో రవీందర్, సిబ్బంది జీవన్ రెడ్డి, జుబేర్, ఇజాజ్, మమత, శ్రీలత, స్వామి పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

వీణవంక, జనవరి 6: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి మల్లారెడ్డి (55) అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వంశీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న ఉదయం 10 గంటలకు మల్లారెడ్డి.. భార్య లక్ష్మితో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదని అతడి భార్య ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అట్టహాసంగా 'పారమిత' వార్షికోత్సవం

జ్యోతిప్రజ్వలన చేస్తున్న విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాద్ రావు

కమాన్‌చౌరస్తా, జనవరి 6 : జిల్లా కేంద్రంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో 'టైంలెస్ వోయేజ్' పేర్టి నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా సాగాయి. ఈ కార్యక్రమాన్ని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాద్ రావు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు కాలంతో పోటీ పడుతూ, ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో పాఠశాల యాజమాన్యం ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగునీటికి రైతుల తండ్లాట

సాగుకు సమయం దాటిపోతుండడంతో నీటి కోసం రైతులు తండ్లాడాల్సి వస్తున్నది. గతంలో కల్వల ప్రాజెక్ట్ (చెరువు)లో పుష్కలంగా నీళ్లు ఉండడంతో కింద పారుకం ఉన్న వీణవంక, శంకరపట్నం మండలాల రైతులు సరైన సమయంలో పంటలు వేసుకునే వారు. అయితే, కొన్ని రోజుల కిందట కురిసిన వర్షానికి ప్రాజెక్ట్ కోతకు గురై నీరు బయటకు వెళ్లిపోయింది. ఇటీవల ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయడంతో కల్వల చెరువులోకి వచ్చిన నీరు వృథాగా పోతున్నది. అధికారులు పట్టించుకోకపోవడంతో వీణవంక, మల్లన్నపల్లి, బ్రాహ్మణపల్లి, కల్వల గ్రామాల రైతులే స్వయంగా ఇసుక, మట్టితో బస్తాలు నింపి కట్ట మరమ్మతులు చేపట్టారు.

కల్వల చెరువు వద్ద మరమ్మతులు చేస్తున్న రైతులు

- వీణవంక, జనవరి 6

నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక

కోర్టుచౌరస్తా, జనవరి 6: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ఆదివారం కరీంనగర్‌కు రానున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు మంకమ్మతోటలోని స్వగృహానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు జస్టిస్ కుమారయ్య లా కాలేజీలో చదివిన న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరవుతారు. బొమ్మకల్ బైపాస్ రోడ్డులోని టీవీ గార్డెన్‌లో సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తారు. అనంతరం జస్టిస్ ఈవీ వేణుగోపాల్ పటేల్ మిత్ర సంఘం ఆత్మీయ సత్కారం స్వీకరించనున్నారు. రాత్రి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారు.

సంతానం కలగడం లేదని యువకుడి ఆత్మహత్య

రాంనగర్, జనవరి 6: నగరంలోని కట్టరాంపూర్‌కు చెందిన ఓ యువకుడు సంతానం కలగడం లేదని మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టరాంపూర్‌కు చెందిన బండ మీది రాజ్‌కుమార్ (35)కు 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. పిల్లలు కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లోని బెడ్రూంలో ఉరేసుకున్నాడు. తల్లి లక్ష్మి పిలిచినా పలుకకపోవడంతో అనుమానం వచ్చి కేకలు వేయగా చిన్న కొడుకు వచ్చి తలుపులు పగులగొట్టి చూసే సరికి పైకప్పునకు వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సహాయంతో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రాజ్‌కుమార్‌ను పరీక్షించిన వైద్యులు రాత్రి 8 గంటల సమయంలో మృతిచెందినట్లు నిర్ధారించడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. రాజ్‌కుమార్ తండ్రి సాయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

సంఘం వ్యాపార అభివృద్ధికి కృషి చేయాలి

కొత్తపల్లి, జనవరి 6: సంఘం వ్యాపార అభివృద్ధికి డైరెక్టర్లంతా కృషి చేయాలని ఆదర్శ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఎండీ న్యాలకొండ శంకరయ్య సూచించారు. చింతకుంట రైతు సంఘ భవనంలో శనివారం ఆయన డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఈవో అనురాధ, డైరెక్టర్లు బండ కిషన్‌రెడ్డి, కన్వీనర్ వాసు, లక్ష్మీరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చిట్కూరి బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్లూబెల్స్‌లో ఆకట్టుకున్న ప్రదర్శన

ప్రదర్శన తిలకిస్తున్న ప్రిన్సిపాల్ జంగా సునీత-మనోహర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, జనవరి 6: జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో గల బ్లూబెల్స్ హైస్కూల్‌లో శనివారం యూలో టెక్నో కోడింగ్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణను కంప్యూటర్‌కు సంబంధించిన నమూనాలు, చార్టులు, బెలూన్లతో అలంకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కాసర్ల ఆనంద్‌కుమార్, ఎస్ఎస్ఏ క్వాలిటీ కో-ఆర్డినేటర్ కే అశోక్ రెడ్డి, ఎంఈవో మధుసూదనా చారి, జిల్లా సైన్స్ ఆఫీసర్ సీహెచ్ జైపాల్ రెడ్డి, కే శ్రీనివాస్, ఎం శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ జంగా సునీత-మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

'వినోద్‌కుమార్‌పై తప్పుడు ప్రచారం సహించం'

సైదాపూర్, జనవరి 6: మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌పై అసత్య ఆరోపణలను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, మండల ప్రధాన కార్యదర్శి చెల్లెల్ల రాజేశ్వర్‌రెడ్డి ఖండించారు. నిప్పులాంటి వ్యక్తిపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోబోమని శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వారు పేర్కొన్నారు.

ఆరోపణలు సరికాదు

కమాన్‌చౌరస్తా, జనవరి 6: మాజీ ఎంపీ వినోద్ కుమార్‌పై ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్ఎస్వీ శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరంలోని బీఆర్ఎస్వీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ బీఆర్ఎస్వీ నగర అధ్యక్షుడు బొంకురి మోహన